మానేరువాగులో నీట మునిగిన మంచినీటి బావులు

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజల మంచినీటి అవసరాలు తీర్చే మంచినీటి బావులు నీటమునిగినాయి. మండలంలోని గట్టెపల్లి మానేరు వాగులో ఉన్న మున్సిపల్ బావుల నుంచి సుల్తానాబాద్ పట్టణ రక్షిత మంచినీటి పథకం అమలవుతున్నది. అయితే కరీంనగర్ డ్యాం గేట్లు తెరవడం వల్ల గట్టెపల్లి మానేరు వాగు ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించడంతో అందులో ఉన్న మున్సిపల్ మంచినీటి బావులు, వాటిలో ఉన్న కరెంటు మోటార్లు మునిగిపోయాయి. దీంతో పట్టణ మంచినీటి సరఫరాకు మళ్లీ ఆటంకం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు



ఐసీపీఎస్ కార్యకలాపాలపై సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టచర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానికసంస్థల అదనపుకలెక్టర్ జె అరుణశ్రీ, డీసీపీ కరుణాకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బి వనజతోకలిసి రోడ్డుప్రమాదాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ బసంత్‌నగర్‌లో మరో 2చోట్ల 5లక్షల రూపాయలతో హైమాస్‌లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డుపై వాహనాల వేగాన్ని తగ్గించేందుకు అవసరమైన మేర స్ప్రింక్లర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్డుపై పశువులు విడిచిపెట్టే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తూ 10వేలరూపాయల జరిమానా విధించాలని, పశువులను గోశాలలకు తరలించాలని అన్నారు. జిల్లాలో ట్రాఫిక్‌నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. హెచ్.కే.ఆర్ సిబ్బంది మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పెద్దపల్లిపట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన మేర రోడ్డువిస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రామగుండంలో అవసరమైన చోట సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా గతసంవత్సరం జరిగిన ప్రమాదాలపై రిపోర్ట్ అందించాలని అన్నారు. ప్రతిపాఠశాలవద్ద స్కూల్‌జోన్ బోర్డులు ఉండాలన్నారు. హిట్‌అండ్‌రన్ కేసుల బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదనలు త్వరగా పంపాలని పోలీస్ అధికారులకు సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకునేలా చర్యలు..

పెద్దపల్లి కల్చరల్ : జిల్లాలోని అనాథ, తల్లిదండ్రులు లేని పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం ఆయన జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటులో ఐసీపీఎస్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అనాథ, పాక్షిక అనాథ పిల్లలను పూర్తిస్థాయిలో గుర్తించాలన్నారు. పిల్లల తల్లిదండ్రుల పేరుమీద ఏమైనా ఆస్తులు ఉంటే అన్యాక్రాంతం కాకుండా వారికి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వారికి పూర్తి స్థాయిలో విద్యను అందించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ శాఖ నుంచి వచ్చే అనాథపిల్లల జాబితాను ఆమోదించి కేజీబీవీలు, గురుకులాల్లో చేర్పించాలన్నారు. చైల్డ్‌కేర్ టోల్‌ఫ్రీనంబర్ 1098కు వచ్చే ప్రతి ఫిర్యాదును స్వీకరిం చాలని ఆదేశించారు. బాలసదనంలోని పిల్లలు కింద పడుకోకుండా వారికి బెడ్లుఏర్పాటు చేయాలన్నారు. స్నాక్స్‌అందించాలన్నారు. సుల్తానాబాద్‌లో మంజూరైన బాలసదనం పనులు డిసెంబర్ చివరికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమఅధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్ చివరికి పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లి కల్చరల్: జిల్లాలో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులు డిసెంబర్ చివరి వరకు పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలో చేపట్టిన పలుఅభివృద్ధి పనులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే 5నుంచి 10ఏళ్ల వరకు అవసరాలకు దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపాదికన డిసెంబర్ చివరికి పూర్తిచేయాలన్నారు. జిల్లాలో మంజూరుచేసిన తహసీల్దార్ కార్యాలయం పనులువేగవంతం చేయాలన్నారు. సమావేశంలో పీఆర్ ఈఈ గిరిష్ బాబు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పారిశుధ్యంపై

స్పెషల్ డ్రైవ్

- పరిసరాల పరిశుభ్రం, వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- వచ్చే నెల 3 నుంచి 11 వ తేదీ వరకు వారం పాటు నిర్వహణ
- మార్గదర్శకాలు జారీ చేసిన అధికారులు
- పంచాయతీలను వేధిస్తున్న నిధుల కొరత

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)



జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం కాపాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వచ్చేనెల 3నుంచి 11వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్, మండల పంచాయతీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శులను, సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆయన ఆదేశించారు. ఆ మేరకు డీపీవో అన్ని గ్రామ పంచాయతీలకు వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశారు.



3 నుంచి 11 వరకు స్పెషల్ డ్రైవ్..

ఈ ప్రత్యేక కార్యక్రమం నవంబర్ మూడవ తేదీ నుంచి 11వ తేదీ వరకు వారం రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిరోజు గ్రామంలోని అన్ని వాడలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మురికి కాలువలను పరిశుభ్రం చేయాలని పేర్కొన్నారు. అలాగే మురికి నీరు అంతా సాఫీగా దిగువకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటికి తిరుగుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. గ్రామంలోఖాళీ స్థలాలు, ప్లాట్‌లలో ఉండే పిచ్చి మొక్కలను తొలగించాలని, చెత్తాచెదారం వేయకుండా చూడాలని, ఇందుకు అయ్యే ఖర్చును ప్లాట్ల యజమానుల నుంచి వసూలు చేయాలని నిర్దేశించారు. పంచాయతీ ఆస్తులు అయిన పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాలు, నర్సరీలు, తెలంగాణ క్రీడ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు, నల్లా కనెక్షన్ పన్నులు, దుకాణాల లైసెన్సుల ఫీజులు, తదితర పనులకు సంబంధించి బాకీ ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

ఈ నెలాఖరులో 50శాతం, నవంబరు నెలాఖరులోగా 100శాతం వసూళ్లు పూర్తిచేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో గల మాంసాహారం, చికెన్‌సెంటర్లలో తాజా విక్రయాలు జరిగేలా చూడాలని, ఏమైనా లోపాలు ఉంటే యజమానులకు జరిమానాలు విధించి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. ఇంటింటికి సురక్షితమైన తాగునీటిని సరఫరా చేసేందుకు మిషన్ భగీరథ అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి రోజు తాగునీటిని క్లోరేషన్ చేయాలని, పైప్‌లైన్‌లో లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. గ్రామ పారిశుధ్య కమిటీలను చైతన్యపరిచే వారిచే సమావేశాలు నిర్వహించి గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించేలా చూడాలి. అలాగే పటిష్టంగా పారిశుధ్య

మిగతా 8వ పేజీలో..

అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించిన స్వప్నారాణి

ధర్మారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ సెంటర్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె స్వప్నారాణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్లలో చిన్నారుల సౌకర్యాలపై అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పూర్వ ప్రాథమిక పాఠశాలల్లోని స్టాక్‌ను పరిశీలించారు. చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సెంటర్ల నిర్వహణ ఉండాలని ఆదేశించారు. అంగన్‌వాడీ-2లో నూతనంగా నిర్మాణం జరుగుతున్న భవన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలతో రైమ్స్ చదివించి ఆక్టివిటీస్‌ను పరిశీలించారు. వారితో ముచ్చటించి కాసేపు సరదాగా గడిపారు.

నియామకం



నియామకపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు విజయ భాస్కర్

ధర్మారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన ఎర్రం సంజీవ్‌ను నియమించారు. ఈమేరకు రాష్ట్రఅధ్యక్షుడు కొత్త విజయ భాస్కర్ నియామకపత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు అధ్యక్షుడు విజయ్ భాస్కర్‌కు సంజీవ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఖోఖో కోచింగ్ క్యాంప్ సందర్శన

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండియన్ మిషన్ స్కూల్‌లో జిల్లాఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల కోచింగ్ క్యాంపును గురువారం నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లాఅధ్యక్షుడు బొంకూరి శంకర్ సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లాకు మంచిపేరును తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడాధికారి సురేష్, వ్యాయామ ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల సురేందర్, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడ్, కోచ్ లక్ష్మణ్, పాల్గొన్నారు.

నిర్మాణాలను వేగవంతం చేయాలి

జూలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఆయాగ్రామాల కార్యదర్శులు కృషిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో పద్మజ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకసమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదు

ఎలిగేడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీకి సంబంధించిన పలురకాల పన్నుల వసూళ్ల విషయంలో కార్యదర్శులు నిర్లక్ష్యం చేయరాదని మండల పంచాయతీ అధికారి కిరణ్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో 12 గ్రామపంచాయతీ కార్యదర్శులు పన్నులవసూళ్లు, ప్రత్యేక పారిశుధ్యం, తాగునీటి సమస్యలు, కరెంటు సమస్యలు డార్పిగ్ రికార్డుల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు.

మున్సిపల్ అభివృద్ధికి మరో రూ.62కోట్లు



సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మున్సిపల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 62కోట్ల 23లక్షల రూపాయల మంజూరు చేసిందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవో నంబర్ 732 ద్వారా నిధులు మంజూరు అయ్యినట్లు తెలిపారు. ఈ నిధులతో పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో ఎనిమిది ప్యాకేజీల ద్వారా అభివృద్ధి పనులను చేపడితే సుందరంగా మారుతుందన్నారు. పది సంవత్సరాలు అభివృద్ధికి నోచుకొని పెద్దపల్లి పట్టణం ఇప్పుడు రూపురేకలు మారుతోందన్నారు. ఈ సందర్భంగా పార్టీశ్రేణులు ఎమ్మెల్యే విజయరమణా రావుకు, రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ బాణాసంచా కాల్చి మితా యిలు పంచి ఘనంగా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప భూతగడ్డ సంపత్, బొడ్డుపెల్లి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొంథా ముంచేసింది..

- జిల్లాలో 8వేల ఎకరాల్లో వరి, 2 వేల ఎకరాల్లో పత్తి పంటకు నష్టం
- ఆదుకోవాలని కోరుతున్న రైతులు



మంథని : విలోచవరం గ్రామంలో వరి పంటలో చేరిన నీటిని చూపుతున్న మహిళా రైతు

పెద్దపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో కురిసిన అకాలవర్షాలతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. పంట చేతికి అందే సమయంలో కురిసిన వర్షాలతో రైతులు కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. బుధవారం ఉదయంనుంచి గురువారం రాత్రి వరకు కుండపోతగా వర్షం కురియడంతో ఆయామండలాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. చాలాగ్రామాల్లో ఈదురుగాలులు, భారీ వర్షానికి కోతకు వచ్చిన వరి నీట మునిగింది. పత్తి తడిసిపోగా, దూది నల్లగా మారుతున్నదని రైతులు తెలిపారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, మంథని, సుల్తానాబాద్ మండలాల్లో ఎక్కువగా పంటనష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 80ఎకరాల్లో వరిపంట, 2వేల ఎకరాల్లో పత్తిపంటకు నష్టం వాటిల్లిందని రైతులుతెలిపారు. 53క్వింటాళ్ల వరి ధాన్యం పలు మార్కెట్‌యా ర్డులు, కొనుగోలు కేంద్రాల్లో తడిసి కొట్టుకు పోయాయి. కానీ వ్యవసా యశాఖ అధికారులు మాత్రం సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో 271ఎకరాల వరిపంటకు నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉద యం వరకు జిల్లావ్యాప్తంగా 82.3మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయింది. అత్యధికంగా ఓదెల మండలంలో 150.8మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అలాగే కాల్వశ్రీరాంపూర్ మండలంలో 122.6, ముత్తారం మండలంలో 120.4, సుల్తానాబాద్ మండలంలో 96.5, ఎలిగేడు మండలంలో 87.2 మంథని మండలంలో 83.6, పెద్దపల్లి మండలంలో 82.2 రామగిరి మండలం 80.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కమాన్‌పూర్ మండలంలో 75.4, ధర్మారం మండలంలో 53.6, అంతర్గాం మండలంలో 51.6,రామగుండం మండలంలో 46.6, పాలకుర్తి మండలంలో 45.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పంటనష్టపోయిన రైతులు తమకు పరిహారంఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతు న్నారు.



ముత్తారం: నీట మునిగిన వరి పొలాలు



పెద్దపల్లి: నిట్టూరులో నేలవాలిన వరి పంట

అన్నదాత 'వరి'గోస..

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలంలో మొంతా తుఫాన్ ఎఫెక్ట్‌తో కొన్ని గ్రామాల్లోని వరిపంటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దకల్వల తదితర గ్రామాల్లో వరిపంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా 120ఎకరాల్లో వరిపంట నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు అంచనా వేసినట్లు ఏవో అలివేణి తెలిపారు.

(మిగతా 8వ పేజీలో..)

ఉప్పు నీటితో ధాన్యం మొలకెత్తకుండా జాగ్రత్త పడవచ్చు 8లో..

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని పెద్దపల్లి మాజీఎమ్మెల్యే, బీఆర్ఎస్‌నాయకుడు దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన సందర్శించారు. తడిసిన, కొట్టుకుపోయిన ధాన్యానికి సంబంధించిన రైతులను పరామర్శించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ద్వారా తగిన నష్టపరిహారం ఇప్పించేలా బీఆర్ఎస్ కృషిచేస్తుందన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కూడా రైతుబిడ్డనేనని, రైతులకష్టాలు ఏంటో ఆయనకు బాగా తెలుసన్నారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి తక్షణమే కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గర్రెపల్లి,సుద్దాల సింగిల్ విండోచైర్మన్ జూపల్లి సందీప్ రావు, గడ్డంమహిపాల్‌రెడ్డి, మాజీఎంపీపీ పాల రామారావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజమల్లయ్య, తాళ్లపల్లి మనోజ్ గౌడ్, గొట్టం మహేష్, ఓదెల దేవస్థానం మాజీ డైరెక్టర్ కర్రెకుమారస్వామి, మత్స్య శాఖ జిల్లా మాజీడైరెక్టర్ గరిగంటి కుమార్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం పెద్దపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెంజర్ల లక్ష్మీనారాయణ(35) బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈక్రమంలో బస్టాండ్ నుంచి గోదావరిఖని వెళ్లే బస్సు సిగ్నల్ వద్ద లక్ష్మీనారాయణను ఢీకొట్టింది. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అప్పటికే వైద్యులు అతడు మృతిచెందినట్లు ప్రకటించారు. మృతుడు లక్ష్మీనారాయణ తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన దేశినిరాజు గురువారం తాడిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద జారిపడ్డాడు. అతని కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, మాజీఎంపీపీ సారయ్యగౌడ్, మాజీఎంపీటీసీ పోసాల సదానందంతోపాటు గ్రామస్థులు కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజును కరీంనగర్‌కు తరలించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్ష

● ముగ్గురికి జరిమానా

కోల్‌సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, ముగ్గురికి జరిమానాను గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ విధించినట్టు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బీ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. గోదావరిఖనికి చెందిన రాయమల్లు అనేవ్యక్తి మద్యం సేవించి రెండోసారి పట్టుబడగా అతనికి మూడురోజుల జైలు శిక్ష విధించి కరీంనగర్ జైలుకు తరలించిట్లు, మరోముగ్గరికి రూ.6వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

ఇసుక మాఫియాపై అధికారుల కొరడా



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్లు, టిప్పర్లు (ఫైల్)

దాడులకు దిగిన మాఫియా

కోరుట్ల మండలం నాగులపేట, సంగెం, కథలా పూర్ మండలం తక్కళ్ళపల్లికి చెందిన పలువురు రెవెన్యూ సిబ్బందిపై దాడులకు దిగిన ఘటనలు చోటుచేసుకున్నాయి. వరద కాలువ వెంట భారీ డంపులను ఏర్పాటు చేసుకున్న మాఫియా అటు వరద కాలువపై అనునిత్యం నిఘా ఉండే లష్కర్లను కూడా బెదిరించిన ఘటనలు ఉన్నాయి. దీంతో రాత్రి వేళల్లో అధికారులు, పోలీసులు వరుసగా దాడులు చేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు.

ప్రత్యేక బృందాలతో నిఘా



వినోద్, తహసీల్దార్, కథలాపూర్

గ్రామాల్లో జీపీవోలు, ఆఫీస్ అసిస్టెంట్లు, పోలీసులతో కలిసి నిరంతరం దాడులు చేస్తున్నాం. వాగు వెంట ఇసుక మాఫియా తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దొంగదారుల వద్ద నిఘా ఉంచాం. ట్రాక్టర్లు, టిప్పర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించాం. ఉన్నతాధికారులు భారీ జరిమానాలు విధించాలనే నిబంధన పెట్టారు.

● రెవెన్యూ బృందాల ఆకస్మిక దాడులు
● ట్రాక్టర్లు, టిప్పర్లు పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాలు ఇసుక మాఫియాపై కొరడా ఝుళిపిస్తున్నాయి. గ్రామ పాలనాధికారులతో కలిసి బృందాలు ఎప్పటికప్పుడు కథలాపూర్ మండలంలోని పెద్దవాగులో రాత్రివేళల్లో నిఘా పెంచి ఆకస్మికంగా దాడులు చేస్తుండడంతో అక్రమార్కులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కథలాపూర్ పెద్దవాగు వెంట ప్రతీ రోజు సుమారు వంద ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో టిప్పర్లతో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామ శివారుల్లో పలు ప్రాంతాల్లో ఇసుక నిల్వ చేసి అక్కడి నుంచి టిప్పర్లతో ఇతర జిల్లాలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాగును ఆనుకొని ఉన్న రైతుల భూములు కోతకు గురై ఇసుక మేటలు పెట్టగా సదరు రైతులకు డబ్బులు చెల్లించి కొందరు అక్రమార్కులు ఇసుకను కొనుగోలు చేసి వేరే ప్రాంతాల్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. భారీ టిప్పర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేయడంతో రోడ్లన్నీ ధ్వంసం కాగా ఇటీవల భీమారం మండలం మన్నెగూడెం వద్ద గ్రామస్థులు టిప్పర్లను అధికారు లకు పట్టించారు. ఇటీవల కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశాలతో కథలాపూర్ మండలంలోని తక్కళ్ళపల్లి, బొమ్మెన, సిరికొండ, పోసానిపేట, తాండ్ర్యాల, గం భీర్‌పూర్ గ్రామాల్లో అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెంచారు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు శిక్ష

జగిత్యాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించడంతో పాటు హత్యాయత్నం చేసిన సంఘటనలో నిందితుడికి కరీంనగర్ మూడవ ఆడిషనల్ సెషన్స్ జడ్జి నీరజ ఏడాది కఠిన కరాగార జైల్ శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. వివ రాల్లోకి శితే.. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన సాగర్, నితిన్ ఇద్దరు స్వంత అన్నదమ్ములు కాగా, అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్, నితిన్ ఇద్దరు మిత్రులు. అయితే, తన తమ్ముడిని నీతో తిప్పుకుంటూ వాడి చదువు నాశనం చేస్తున్నావ్ అంటూ సాగర్ సంతోష్‌ను మందలించడానికి యత్నించాడు. దీంతో తీవ్ర అసహనానికి గురైన సంతోష్ కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి డీఎస్పీ వెంకటరమణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశాడు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి కఠిన కారాగార జైల్ శిక్షతో పాటు వెయ్యి జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసులను జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత

తిమ్మాపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారిని పట్టుకున్నట్లు ఎల్ఎండి ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. తిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో అక్రమంగా, అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుకతో కూడిన లారీని ఎల్ఎండి పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి సిద్దిపేటకు తీసుకువెళ్తున్న లారీని తిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టషన్‌కు తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ మల్రి నాగరాజుపై కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంటపొలాలు నీట మునిగాయని రైతుల రాస్తారోకో

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పనులు చేపట్టిన డీబీఎల్ రోడ్డు కంపెనీ నిర్లక్ష్యం కారణంగా తమ పంట పొలాలు నీట మునిగాయని గురువారం మండలంలోని సింగాపూర్ గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సింగాపూర్ చెరువు వద్ద రోడ్డు నిర్మాణ సంస్థ సరైన బ్రిడ్జిని నిర్మించకపోవడం వలన పంటలు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు మత్తడి పొంగిన సమయంలో నీరు సక్రమంగా పోక, బ్యాక్ వాటర్‌తో గ్రామానికి చెందిన దాదాపు 150 ఎకరాల వరి పంట పూర్తిగా మునిగిపోయిందన్నారు. వారం రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంటలు నీట మునగడంతో లక్షల్లో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుమ్మనపల్లి సింగిల్ విండో చైర్మన్ కౌరు సుగుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సింగాపూర్ చెరువు వద్ద సరైన బ్రిడ్జి నిర్మించాలని జాతీయ రహదారుల డైరెక్టర్ కృష్ణారెడ్డికి, ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించకపోవడం మూలంగా రైతులు పంట నష్టపోయారన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించి పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



సింగాపూర్‌లో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకుడు

● స్థానికుల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు

గన్నేరువరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం చెరువు వద్ద కల్వర్టుపై ప్రవహించే వరదనీటిలో మండల కేంద్రం నుంచి కరీంనగర్‌కు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై వెళుతూ బీహార్‌కు చెందిన రజీప్ అనే యువకుడు వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయాడు. మత్తడి వద్ద గతంలో నిమజ్జనం చేసిన దుర్గామాత విగ్రహ స్టాండు వరదనీటిలో అతడి చేతికి అందడంతో దానిని పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే స్థానిక మత్స్యకారులు గమనించి అతడిని తాడు సహాయంతో బయటకు తీశారు. వరద ఉధృతి ఉన్నందున కల్వర్టుపై వెళ్లకూడదని పోలీసులు స్టాపర్‌లను ఏర్పాటు చేసినప్పటికీ దానిని లెక్క చేయకుండా వెళ్లడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వీణవంక,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మండలంలోని రెడ్డిపల్లి గ్రామనికి చెందిన సుకాశి నరేష్ (35) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం నరేష్ కొంత కాలంగా మద్యానికి బానిస కాగా భార్య తన ఇద్దరు కూతళ్లతో వాళ్ల అమ్మగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి తాగుతూ గ్రామంలోని వాళ్లతో గొడవపడుతున్నాడు. మంగళవారం మద్యం తాగి నరేష్ తన అన్న సురేష్‌కి ఫోన్ చేసి తిట్టడంతో సురేష్ రెడ్డిపల్లిలో నరేష్ వద్దకు వెళ్లి నెట్టి వేయడంతో బండపై పడి తలకు తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే వరంగల్ ఎంజీఎం అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు తెలిపారు. మృతుని తండ్రి సుకాసి రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు సీఐ లక్ష్మీనారయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

మానేరు వాగులో గల్లంతైన 16వేల బాతులు

మానకొండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీనివాస్‌నగర్ శివారులోని మానేరు వాగులో బుధవారం రాత్రి 16వేల బాతులు గల్లంతు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాకు చెందిన డేవిడ్ అనే వ్యక్తి బతుకు దెరువు కోసం 16వేల బాతులతో మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామ శివారులోని మానేరు వాగులో తాత్కాలిక డేరా వేసుకొని జీవిస్తున్నాడు. ఎల్ఎండీ గేట్లు ఎత్తివేయడంతో వరద తాకిడికి 16వేల బాతులు గల్లంతు కాగా తమ కుటుంబం తప్పించుకొని ఒడ్డుకు చేరుకున్నట్లు బాధితుడు డేవిడ్ వాపోయాడు. సుమారు వీటి విలువ రూ. 20లక్షలు ఉంటుందని బాధితుడు లబోదిబో మంటున్నాడు.

మానేరులో దూకి ఒకరి గల్లంతు

తంగళ్లపల్లి, అక్టోబరు 30 (ఆంధజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సల్లంగుల కృష్ణ(60) మానేరు నదిలో దూకి ఆదృశ్యమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుం బ సభ్యుల కథనం.. కృష్ణ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా ఉపాధి లేకపోవడంతో పాటు అనారోగ్య సమస్యలు తోడయ్యాయి. ఆసుపత్రికి వెళ్తున్నాని కుటుంబ సభ్యులకు చెప్పి ఉదయం బయల్దేరిన కృష్ణ సాయంత్రం తంగళ్లపల్లి మానేరు వంతెన పైనుంచి నదిలో దూకాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్‌పల్లివాసి మృతిని ధ్రువీకరించిన ఎంబసీ

● ఐదేళ్లుగా బహ్రెయిన్ మార్చురీలోనే మృతదేహం ● అక్కడే అంత్యక్రియలు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్‌లో చనిపోయిన ఐదేళ్ల తర్వాత జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం రాంనగర్‌కు చెందిన శ్రీపాద నరేష్ అనే వ్యక్తికి ఇండియన్ ఎంబసీ మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం రాంనగర్‌కు చెందిన శ్రీపాద నరేష్ 2020 మే 28న బహ్రెయిన్ దేశంలోని ఓ ఆసుపత్రిలో మృతి చెందాడు. కాగా బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ 2025 అక్టోబరు 1న డెత్ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అక్టోబరు 30న అధికారికంగా ఈ-మెయిల్ ద్వారా తెలియజేసింది. అనారోగ్యంతో చనిపోయిన శ్రీపాద నరేష్ మృతదేహాన్ని బహ్రెయిన్‌లోని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులను ఉటంకిస్తూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో శ్రీపాద నరేష్ ఐదేళ్ల క్రితం మృతిచెందిన విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ సహాయం కోసం ఈనెల 21న హైదరాబాద్‌లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించారు. నరేష్ మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాగా శ్రీపాద నరేష్ చనిపోయి చాలాకాలం అయినందున మృతదేహాన్ని భారత్‌కు తరలించడం సాధ్యం కాదని, అంత్యక్రియలు బహ్రెయిన్‌లోనే నిర్వహించాలని మృతుడి బంధువులకు ఎంబసీ సూచించింది. దీంతో శ్రీపాద నరేష్ అంత్యక్రియలకు బహ్రెయిన్ వెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రవాసీ సంఘాలు సహాయం చేయాలని అతడి సోదరుడు ధర్మపురి ఆనంద్ కోరాడు.

విద్యార్థుల మధ్య ఘర్షణ..?

వేములవాడ క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ శివారులోని అయ్యప్ప స్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న మైనారిటీ గురుకుల సంక్షేమ విద్యాలయంలో ఈ నెల 26న ఆదివారం విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. మైనారిటీ గురుకుల సంక్షేమ విద్యాలయంలో పదో తరగతితో పాటు ఇంటర్ ఉంది. అయితే పాఠశాల, ఇంటర్ విద్యార్థుల మధ్య టీ తాగే సమయంలో మాటమాట పెరిగి గొడవకు దారితీసిందని, ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ఘర్షణకు కారణమైన విద్యార్థులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తల్లి, కొడుకుపై గొడ్డలితో దాడి

● చికిత్స పొందుతూ తల్లి మృతి

శంకరపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేటలో తల్లి కొడుకుపై భార్య, భార్య తరుపు బంధువులు గొడ్డలితో దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కరీంపేట గ్రామానికి చెందిన గడ్డం మల్లవ్వ (65), తన కొడుకు గడ్డం రాజుపై రాజు భార్య, భార్య తరుపు బంధువులు గొడ్డలితో దాడి చేశారు. దాడిలో మల్లవ్వ, రాజు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలిలంచారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మల్లవ్వ మృతి చెందింది. రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. కాగా కుటుంబ కలహాలే ఈ దాడికి కారణమని గ్రామస్థులు పేర్కొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను మెట్‌పల్లి పోలీస్‌లు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్ వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లికి చెందిన ఒల్లెపు కాశీరాం, హైదరాబాద్‌కు చెందిన దండుగుల ఎల్లయ్య, బాన్సువాడకు చెందిన బోదాసు సాయిలులు ముఠాగా ఏర్పడి మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, మెదక్ తదితర పట్టణాల్లో తాళం వేసిన ఇళ్లలో, ఆలయాల్లో చొరబడి బంగారం, వెండి, నగదు దొంగతనానికి పాల్పడేవారని తెలిపారు. దొంగిలించిన సొమ్మును పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి తునికి వెంకటచారికి విక్రయిస్తుండేవారని పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దొంగల ముఠాను గురువారం పట్టణంలోని లక్ష్మీ థియేటర్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 20 వేల నగదు, 15 గ్రాముల వెండి, 4 మొబైల్ ఫోన్లు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాట్లు పేర్కొన్నారు. నిందితులు ఒల్లెపు కాశీరాం, దండుగుల ఎల్లయ్య, బోదాసు సాయిలు, తునికి వెంకటచారిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వ్యాపారులు, ఇతరులు ఎవరైనా దొంగసొత్తును కొనుగోలు చేసే చట్టాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి పోలీసులు

సింగరేణి కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు చేనవేన సాయికుమార్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. గురువారం సింగరేణిలో పనిముగించుకొని ఇంటికి తన ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో బేగంపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయలు ఆసుపత్రికి తరలించారు.

ఏఎల్‌పీలో సపోర్ట్‌మెన్‌కు అస్వస్థత

రామగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో సపోర్ట్‌మెన్ గురువారం అస్వస్థతకు గురయ్యాడు. ఏఎల్‌పీలో పి-షిఫ్టుల్లో 86లెవల్ వద్ద విధులు నిర్వహిస్తున్న సపోర్ట్‌మెన్ తోట రవి అస్వస్థతకు లోనై పనిస్థలంలో కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు రవిని హుటాహుటిన సర్ఫేస్‌కు తరలించారు. అనంతరం అంబులెన్స్‌లో సెంటినరీకాలనీ డిస్పెన్సరీకి తరలించారు. స్థానిక డిస్పెన్సరీ వైద్యుడి ప్రథమచికిత్స అనంతరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మరమ్మతులకు నోచుకోని వైకుంఠధామం



శ్రీనివాస్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

మానకొండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగంగా మారింది. శ్రీనివాస్‌నగర్ గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మానేరు వాగు పక్కన రూ. 9లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించారు. ఉపయోగంలో లేకపోవడంతో పిచ్చి చెట్లు మొలిచి అధ్వానం గా మారింది. నిర్మాణాలు కూడా చెడిపోయాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం ఉపయోగంలో లేకుండా పోతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరువ తీసుకొని మరమ్మతు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పాము పట్టివేత

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశనపల్లి గ్రామంలోని చొప్పరి రవి ఇంట్లో గురువారం పాము చొరబడింది. సమాచారం అందుకున్న అటవీశాఖ సెక్షన్ అధికారి నర్సయ్య, పాములు పట్టే గడ్డం శ్రీకాంత్ సహాయంతో ఇంట్లో దూరిన పామును పట్టుకుని, అటవీ ప్రాంతంలో వదిలేశారు.

మత్తు పదార్థాలపై ముమ్మర తనిఖీలు

ధర్మపురి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పాన్ షాపు, కిరాణం షాపుల్లో పోలీస్ నార్కోటిక్ జాగిలాలతో, బాంబు డిస్పోజల్ టీమ్ సభ్యులు గురువారం తనిఖీలు నిర్వహిం చారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ధర్మపురి పట్టణంలో డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ (బీడీ) టీమ్ సభ్యుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అనుమానస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో తనిఖీలు నిర్వహించడం వల్ల పటిష్ట భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయడం జరుగుతుందని అన్నారు. పాన్ షాపుల్లో గంజాయి పదార్థాలను గుర్తించే జాగిలాలతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్, రవీందర్ కుమార్, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



ధర్మపురిలో జాగిలాలతో తనిఖీలు

ఉధృతంగా నీరుకుళ్ల మానేరు వాగు

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం గేట్లను ఎత్తివేయడంతో పెద్ద ఎత్తున వరదనీరు సుల్తానాబాద్ మండల పరిధిలోని గొల్లపల్లి, నీరుకుల్ల, గట్టేపల్లి, తొగర్రాయి తదితర మానేరు పరివాహక ప్రాంత గ్రామాల్లోని వాగులకు చేరింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నీరుకుల్లలో చెక్‌డ్యాం మీదుగా వరదనీరు పొంగి పొర్లుతున్నది. మానేరు వాగులో ఉన్న భూనీల సమేత రంగనాయక స్వామి ఆలయం రక్షణగోడల వరకు నీరుచేరింది. చెక్ డ్యాంను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తున్నారు.



పొంగిపొర్లుతున్న నీరుకుళ్ల మానేరు వాగు చెక్ డ్యాం

వెంకటాపూర్ వాసికి డాక్టరేట్

కోరుట్ల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన అనుమల్ల మహేష్ ఉస్మానియా విశ్వవిద్యాలయం మైక్రో బయోలాజీ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్‌కు ఎంపికయినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. 'ఐచిప్ సపోర్టెడ్ ఐసోలేషన్, ఐడెంటిఫికేషన్ ఆఫ్ నావెల్ తెరాపిటిక్ మైక్రోబ్స్ టు ట్రీట్ హైపర్ యురిసేమియా' అనే అంశంపై చేపట్టిన పరిశోధనలకు డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు.

బాలుడి వైద్య చికిత్సకు ఫేస్‌బుక్ మిత్రుల విరాళం

జగిత్యాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన అల్లాడి ప్రభాకర్-అనురాధ దంపతుల కుమారుడైన రుద్రాన్ష్ (3) అనే బాలుడు గత కొన్ని నెలలుగా బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక అపన్న హస్తం కోసం ఎదిరి చూస్తున్నారు. ఈ క్రమంలో ధర్మపురి నియోజకవర్గ కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ విషయం తెలుసుకుని సోషల్ మీడియాలో బాలుడి వ్యాధి గూర్చి, తల్లిదండ్రుల పేదరికం గూర్చి పోస్ట్ చేశాడు. స్పందించిన ఎన్నారైలు, స్థానిక దాతలు పలువురు బాలుడి వైద్యానికి తమ వంతు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకువచ్చి తోచిన విధంగా బాలుడి తల్లి బ్యాంక్ ఖాతాకు డబ్బులు పంపించారు. మొత్తం రూ. 1.61 లక్షలు పంపారు. జగిత్యాల టౌన్ పోలీసుస్టేషన్‌లో గురువారం సీఐ కరుణాకర్ చేతుల మీదుగాకొంత మొత్తాన్ని బాధిత బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు.

ప్రాజెక్టుల్లోకి పెరిగిన వరద



ఎల్ఎండీ నుంచి విడుదలవుతున్న నీరు

జగిత్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో ప్రాజెక్టులోకి వరదనీరు రావడం పెరిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,09,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 26 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి ఒక లక్ష క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 1,09,654 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మిడ్ మానేరుకు భారీగా ఇన్ ఫ్లో

బోయినపల్లి: రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు గురువారం 9675 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ ద్వారా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో దిగువకు 3 గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.69 సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.760 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

ఇల్లంతకుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల గురువారంప్రారంభం అయ్యింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.49 టీఎంసీల నీరు ఉంది. క్యాచ్‌మెంట్ ద్వారా 300 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయక సాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీలోకి తగ్గుముఖం పట్టిన వరద

తిమ్మాపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం పూర్తి స్థాయిలో నిండుకుంది. తుఫాన్ కారణంగా భారీగా ఎగువ నుంచి వస్తున్న నీటిని గేట్ల నుంచి బయటకు విడుదల చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దాదాపు 12గంటల వరకు కూడా కేవలం 1,277క్యూసెక్కుల నీరు మాత్రమే ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు వస్తుండగా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం కారణంగా ఎగువ నుంచి అర్ధరాత్రి వరకు 66వేల క్యూసెక్కులకు పెరిగిపోయింది. దీంతో బుధవారం మధ్యాహ్నం కేవలం ఎల్ఎండీ రెండు స్పీల్‌వే గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు క్రమంగా మిడ్ మానేరు నుంచి, మోయతుమ్మెద వాగు నుంచి వరద ఉధృతి భారీగా వస్తుండటంతో 14 స్పిల్ వే గేట్లు ఎత్తి 66వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఎగువ నుంచి కూడా వస్తున్న వరద కూడా తగ్గుతుండటంతో గేట్లు క్రమంగా మూసివేశారు. ఎల్ఎండి పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 22.918 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 6,896 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 274 టీఎంసీల నీరు బయటకు విడుదల చేస్తున్నారు.

ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చేపట్టండి

● దంపతుల గల్లంతుపై స్పందించిన బండి సంజయ్

భగత్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చెరువులో గల్లంతైన భార్యాభర్తల కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మల్లంపల్లి చెరువులో గల్లంతైన భార్యాభర్తల సమాచారం కోసం సిద్దిపేట కలెక్టర్‌కు ఫోన్ చేశారు. గల్లంతు వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయంలో అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. స్థానిక బీజేపీ శ్రేణులు సహాయ చర్యల్లో పాల్గొనాలని, వర్ష ప్రభావ ప్రాంతాల్లో పర్యటించాలని పిలుపునిచ్చారు.

పీఎం కిసాన్ కోసం ఎదురుచూపులు



● కొత్త రైతులకు వర్తించని పథకం
● తగ్గుతున్న అర్హుల సంఖ్య

చొప్పదండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైన రైతులకు ఏటా ఆరు వేల రూపాయలను మూడు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ పథకం కోసం అర్హులైన రైతులను దరఖాస్తు చేసుకోవాలని 2019 జనవరి 31 గడువు విధించింది.

కటాఫ్ తేదీగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అర్హులైన రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందజేస్తుంది. కటాఫ్ తేదీని పొడగించక పోవడంతో కొత్త రైతులకు పథకం వర్తించడం లేదు. దాదాపు ఏడు సంవత్సరాలు కావస్తున్నా కటాఫ్ తేదీని పొడగించకపోవడంతో అనేకమంది రైతులు ఏళ్ల తరబడి పథకం కోసం ఎదురుచూస్తున్నారు.

2019 జనవరి తర్వాత భూములు పొందినవారు పీఎం కిసాన్ పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు. కొత్త పట్టాదారు పాస్‌బుక్ ఉండి, రైతు మరణిస్తే వారసులు విరాసత్ ద్వారా భూములు పొందినవారు మాత్రమే కొత్తగా పీఎం కిసాన్ పథకం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 20 విడతలుగా పెట్టుబడి సహాయాన్ని ఈ పథకం కింద అందించగా, తాము వేలాది రూపాయలను కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్పులతో తగ్గుతున్న సంఖ్య...

పీఎం కిసాన్ పథకంలో కొత్త నిబంధనలు, నూతన మార్పులతో ప్రతి ఏటా లబ్దిదారుల సంఖ్య తగ్గిపోతుంది. 10 వేల రూపాయలకు పైగా పించ న్ తీసుకునే రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులుగా ప్రకటించగా ఆదాయపన్ను చెల్లించేవారు, విదేశాల్లో నివాసం ఉండేవారు అనర్హులు. రైతు దంపతులకు వేర్వేరు గ్రామాల్లో భూములు ఉన్నా ఒక్కరికే వర్తిస్తుంది.

పీఎం కిసాన్ కోసం ఫార్మర్ రిజిస్ట్రీ..

పీఎం కిసాన్ పథకంతోపాటు ఇతర పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీని తీసుకువచ్చింది. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తమ భూవివరాలు, ఇతర వివరాలను పొందుపరిస్తే ఒక యూనిక్ ఐడీ నంబర్‌ను కేటాయించారు. ఆధార్ కార్డు మాదిరిగా ప్రతి రైతుకు ఒక కార్డును ఈ రిజిస్ట్రీ ద్వారా అందజేయనున్నారు. నాలుగు నెలల కింద ఈ ప్రక్రియను అన్ని గ్రామాల్లో చేపట్టగా దాదాపు 95 శాతం పూర్తయింది. రైతులందరు ఏఈవోల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కాగా ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారానే పీఎం కిసాన్ 21వ విడత సహాయం అందజేస్తారని సమాచారం. కొత్త రైతులు తమకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.

పీజీ సెమిస్టర్ ఫలితాలు

గణేశ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై 2025న నిర్వహించిన పీజీ, నాలుగు, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఎం.ఏ(ఇంగ్లీష్, ఎకనామిక్స్ సోషియాలజీ, తెలుగు, ఉర్దూ), ఎంకాం. (జనరల్, ఫైనాన్షియల్ అకౌంటింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్), ఎంఎస్సీ (వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, గణితం, మైక్రోబయాలజీ, ఫిజిక్స్ ఇంజనీరింగ్ ఫిజిక్స్ స్టాటిస్టిక్స్ న్యూట్రిషన్ డైటెటిక్స్ ఫూస్ సైన్స్ జువాలజీ), ఎంఎస్‌డబ్ల్యూ ఫలితాలు విడుదల చేశారు.

6న శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల6న గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి శ్రీశైలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం, దేవిశక్తి పీఠం, పాతాళగంగ దర్శనం చేసుకుని 7వ తేదీ సాయంత్రం శ్రీశైలంలో బయలుదేరి 8వ తేదీ ఉదయం గోదావరిఖనికి చేరుకుంటుందని, ఈ సర్వీస్‌కు గోదావరిఖని నుంచి రూ.2200, పెద్దపల్లి నుంచి రూ.2100, కరీంనగర్ నుంచి రూ.2000చార్జిని నిర్ణయించినట్లు, ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ వాసులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి గోదావరి వద్ద హారతి



కొండగట్టులో కార్తీక దీపాలు



వేములవాడలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి దీపం వెలిగించాలని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో తొమ్మిదవ రోజు గురువారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఏడాదిలో పవిత్ర మాసంగా భావించే కార్తీక మాసం సందర్భంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా సాయంత్రం వేళలో గోదావరి నదికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నది వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి వరకు గోదావరి మాతకు హారతి ఇచ్చి భక్తి శ్రద్ధలతో నదిలో దీపాలు వదిలి పెట్టారు.

కొండగట్టులో..

మల్యాల: కార్తీకమాసం పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం రాత్రి దీపాలు వెలిగించారు. వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు భజన, చాలీసా పారాయణం నిర్వహించారు.

వేములవాడలో...

వేములవాడ కల్చరల్ : వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో గురువారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించి పూలతో అలంకరించారు. అనంతరం అర్చకులకు దీపాదానం చేశారు. భీమేశ్వర స్వామివారిని ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందేశ్ ఎస్. దేశ్‌పాండే దర్శించుకున్నారు.

చదువుల బంగారాలు.. అక్కాచెల్లెళ్లు



నర్మద



నీరజ

చందుర్తి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు చదువులో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు అందుకోనున్నారు. మండలంలోని లింగంపేటకు చెందిన కాదాసు నర్మద, నీరజలది పేద కుటుంబం. ఇద్దరు అగ్రహారం కళాశాలలో 2020-22 విద్యా సంవత్సరంలో తెలుగులో ఎంఏ పూర్తిచేశారు. ఆధునిక కవిత్వం అనే అంశంలో నర్మద, జానపద విజ్ఞానం అనే అంశంలో నీరజ అత్యధిక మార్కులు సాధించారు. నవంబరు 7న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో అక్కాచెల్లెళ్లిద్దరూ బంగారు పతకాలను గవర్నర్ చేతుల మీదుగా అందుకోనున్నారు.

గాయపడిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కాట్నపల్లి గ్రామంలో కనుకదుర్గ రైస్‌మిల్లులో బాయిలర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని లేబర్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. కార్మిక అధికారులు, సివిల్ సప్లయి అధికారులు విచారించి కనకదుర్గ రైస్‌మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు పెట్టి, చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు లేబర్ యూనియన్ ఆందోళన చేస్తుందని హెచ్చరించారు.

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి నీటి ప్రవాహం

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది నీటి మట్టం గురువారం పెరిగింది. తుఫాను కారణంగా గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టు లోనికి భారీగా వరద నీరు చేరింది. కడెం ప్రాజెక్టు సంబంధించిన 4 గేట్లు ఎత్తి అధికారులు దిగువ గోదావరి నదిలోకి 34,514 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సాయంత్రం 5 గంటల వరకు గోదావరి నదీ స్నానఘట్టాలు ఆనుకుని ప్రవహిస్తోంది. ఎస్ఆర్ఎస్పీ నుంచి 26 గేట్లు ఎత్తి 1,00,000 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేయడం వల్ల భారీగా వరద చేరి ప్రమాద స్థాయికి చేరుకుంది. నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



ధర్మపురి వద్ద స్నానఘట్టాలు ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి నది

రైతు కష్టం నీటిపాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొంథా తుఫాన్ పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం కళ్ల ముందే కొట్టుకుపోయింది. కోతకు వచ్చిన పంట నీట మునగడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో నీట మునిగిన పంటను చూపిస్తున్న రైతు



పెగడపల్లి మండలం ఆరవెల్లిలో నీట మునిగిన ధాన్యం



ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో తడిసిన ధాన్యం ఆరబోస్తున్న రైతులు



గొల్లపల్లిలో మొలకెత్తిన వరి ధాన్యాన్ని చూపుతున్న రైతు



హుజూరాబాద్ మండలం జూపాకలో...

చొప్పదండి మండలం మంగళపల్లిలో నేలవాలిన మొక్కజొన్న



తిమ్మాపూర్ మండలం రేణికుంటలో నీట మునిగిన వరి





ధర్మారం మండలం మల్లాపూర్‌లో తడిసిన ధాన్యం చూపుతున్న రైతు



తిమ్మాపూర్ మండలం జుగుండ్ల గ్రామంలో తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతు



దర్మపురి మండలం తిమ్మాపూర్‌లో తడిసిన పత్తి

చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





కోనరావుపేట మండలం బావుసాయిపేటలో కొట్టుకుపోయిన ధాన్యం

ఖనిలో ఏఐఎస్ఎఫ్ భిక్షాటన

● ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల్ని విడుదల చేయాలంటూ డిమాండ్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు గురువారం గోదావరిఖనిలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రధానచౌరస్తాలో భిక్షాటనచేస్తూ ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతమ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కళా శాలలు బంద్ చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థుల చదువులకు ఇబ్బందవుతుందని అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేయడం చేయకపోవడం సీఎం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మూడు విద్యా సంవత్సరాలనుంచి ఫీజు బకాయిలు రూ.8500కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో చర్చించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయిఆజాద్, ఎల్కపల్లి సురేష్, గుండేటి తరుణ్, లచ్చేటి అభి, నస్పూరి వర్షిత్, ధరణి అరుణ్, వేముర్ల వివేక్ పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉప్పు నీటితో ధాన్యం మొలకెత్తకుండా జాగ్రత్త పడవచ్చు

ఎలిగేడు/కమాన్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరి పొలంలోని నీటిని పూర్తిగా తొలగించి వాటిపై ఉప్పు నీటిద్రావణం పిచికారిచేస్తే మొలకెత్తకుండా ఉంటుందని మండల వ్యవసాయఅధికారులు ఉమాపతి, రామకృష్ణ తెలిపారు. గురువారం మండలాల్లో వర్షానికి నేలకొరిగిన వరిపంటలను రైతులతోకలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం నీటిని పొలం నుంచి బయటకు పంపి, నీటిని లీటరు నీటికి 50గ్రాముల ఉప్పును కలిపి పిచికారి చేసుకుంటే వడ్లు మొలకెత్తకుండా ఉంటాయని వివరించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యంపై కూడా ఉప్పుద్రావణాన్ని పిచికారిచేస్తే మొలకలు రాకపోవడంతో పాటు రంగు మారకుండా ఉంటుందన్నారు. ఆయనవెంట ఏఈవోలు గణేష్, సురేష్, శరణ్య, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఎలిగేడు: దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఏవో, తదితరులు

పార్టీ పటిష్ఠతకు పాటుపడుదాం

● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రావు

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ పటిష్ఠతకు పాటుపడి స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండాఎగిరేలా పని చేయాలని జిల్లాబీజేపీ ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు పిలుపునిచ్చారు. మండలంలోని సుద్దాల గ్రామంలో గురువారం జరిగిన బీజేపీజిల్లాస్థాయి ముఖ్యనేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అన్నిస్థానాల్లో నిలబెట్టాలని తెలిపారు. జిల్లాలో వర్షాలవల్ల తడిసిన రంగుమారిన దాన్యాన్ని ఎలాంటి నిబంధనలు లేకుండా భేషరతుగా ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొనుగోళ్ల ఆలస్యం వల్ల ధాన్యం తడిసిందని, వాటిని ప్రభుత్వమే బాధ్యత తీసుకొని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రనేత ఠాకూర్ రామ్‌సింగ్, జిల్లాప్రధానకార్యదర్శి పల్లె సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు శనిగర రమేష్, జ్యోతిబసు, నాగుల మల్యాల తిరుపతి, జిల్లా కార్యదర్శులు, మండల శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్ రావు

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన గర్రెపల్లి నాయకులు

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ,పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రిని కలిసి గర్రెపల్లి గ్రామాభివృద్ధి, ప్రజాసమస్యలు, స్థానిక అవసరాల గురించి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచ్ ఫోరం మాజీఅధ్యక్షుడు, గర్రెపల్లి మాజీసర్పంచ్ పడాల అజయ్ గౌడ్, మాజీసింగిల్‌విండో చైర్మన్ కల్లెపల్లి జానీ, తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న అజయ్ గౌడ్, తదితరులు

పంచాయతీల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

(5వ పేజీ తరువాయి)

నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలను సంరక్షించాలని, ఎక్కడైతే గ్యాప్స్ ఉన్నాయో అక్కడ మరల మొక్కలను నాటాలని పేర్కొన్నారు. పంచాయతీ ద్వారా అందే పౌరసేవలను సకాలంలో అందించాల్సి ఉంటుంది. లైసెన్స్ ఫీజులను వచ్చేనెల 15వ తేదీ వరకు వసూలు చేయాలని, విద్యుత్ సమస్యలు ఉంటే ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు.

● పంచాయతీలను వేధిస్తున్న నిధుల కొరత..

గ్రామపంచాయతీలకు సకాలంలో ప్రభుత్వం ఎన్నికల నిర్వహించకపోవడంతో నిధుల కొరతతో సతమతం అవుతున్నాయి. 2024 జనవరి 31 తేదీన పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. 20మాసాలు గడుస్తున్నా కూడా ఎన్నికల నిర్వహించక పోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలోనే నడుస్తున్నాయి. ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం లేదు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇవ్వాల్సిన నిధులను కూడా ఇవ్వకపోవడంతో నిధులకొరత పంచాయతీలను వెంటాడుతున్నది. ఈ క్రమంలో ప్రత్యేక పారిశుద్య కార్యక్రమం నిర్వహణకు అయ్యే ఖర్చు ఎక్కడి నుంచి తీసుకురావాలి అని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి కనీసం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

మొంథా ముంచేసింది..

(5వ పేజీ తరువాయి)

కొత్తపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వరదనీరు చేరడంతో ఉదయం ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు నీటిని మోటార్ల ద్వారా తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

● రైతులను ఆదుకోవాలి..

పెద్దపల్లి నియోజకవర్గ రైతులను ఆదుకోవాల్సిన అవసరం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావుకు ఉందని తెలంగాణ రాజ్యాధికారపార్టీ జిల్లానాయకుడు గుండవేణ స్వామి అన్నారు. మండలంలోని పెద్దకల్వలలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ వెంటనే నష్టపోయిన పంటకు ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

సుల్తానాబాద్: ఎడతెరపిలేకుండా కురిసిన వర్షానికి, ఈదురుగాలులకు కోతకు వచ్చిన వరిపంటలు దెబ్బతిని రైతాంగం తల్లడిల్లుతున్నది. కోతకు సిద్ధంగా ఉన్న పొలాలు నేలపాలయ్యాయి. విక్రయం కోసం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. తేమ శాతం రావడానికి ఎన్ని దినాలు పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 260ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు తేలింది.

కాల్వశ్రీరాంపూర్: మండలకేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో పలువురు రైతుల ధాన్యం కొట్టుకుపోయింది. మండలంలోని కాల్వశ్రీరాంపూర్, వెన్నంపల్లి, ఈదులాపూర్, కిష్టంపేట తదితరగ్రామాల్లో వరిపంట నీటమునిగింది. పూతకువచ్చిన పత్తి రాలిపోయింది. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలనిరైతులువిజ్ఞప్తి చేస్తున్నారు.

జూలపల్లి: మండలంలో సాగుచేసిన పత్తిపంటసైతం చేతికి వచ్చేదశలో దెబ్బతి న్నాయని రైతులు వాపోతున్నారు. మండలంలోని నాగు లపల్లి, చీమలపేట అయాగ్రామాల్లో ధాన్యం తడిసి పోవడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు.

ధర్మారం: మండలంలోని మల్లాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిముద్దయింది. గురువారం అయాగ్రామాల్లో నేలవాలిన పంటపొలాలను వ్యవసాయ అధికారి భాస్కర్ పరిశీలించారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలని, కిందపడిన వరిని కట్టలుగా కట్టి మడిలో గాలి ఆడే విధంగా చూసుకోవాలన్నారు.

మంథని: మంథని డివిజన్‌లోని పలుమండలాల్లో వరి, పత్తిపంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. పొట్ట, కోత దశలోఉన్న వరి, కాతదశలో ఉన్న పత్తిపంటలు వర్షంతో దెబ్బతిన్నాయి. స్థానిక మార్కెట్‌యార్డులో కొనుగోలు కోసం ఆరబోసుకున్న వేలాది క్వింటాళ్ల ధాన్యం పూర్తిగా వర్షంనీటిలో తడిచి ముద్దగా మారింది. వరి కుప్పల చుట్టూ వర్షం నీరు చేరడంతో చెరువును తలపించింది.

మంథనిరూరల్: మండలంలో పలు గ్రామాల్లో పొలాల్లోకి వరదనీరు చేరడంతో పంటలకు పెద్దఎత్తున నష్టం వాట్లింది. సుందిళ్ల బ్యారేజీకి ఎగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు 23గేట్లు ఎత్తడంతో దిగువ ఉన్న సుందిళ్ల బ్యారేజీలోకి 2లక్షల క్యూసెక్‌ల నీరు వచ్చి చేరుతుండటంతో బ్యారేజీ 74గేట్లు ఎత్తి ఉండ టంతో వరద దిగువ ప్రాంతానికి విడుదలవుతోంది.

ముత్తారం: భారీవర్షాలు కురవడం, మానేరు ఉధృతిగా ప్రవహిస్తుండటంతో మండలంలో పంటపొలాలు నీటమునిగి రైతులకు కన్నీటిని తెప్పించాయి. మానేరు ఉగ్రరూపం దాల్చడంతో పరివాహకప్రాంతాలైన ముత్తారం, ఖమ్మంపల్లి, అడవిశ్రీరాంపూర్, ఓడేడు గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో పంటనీట మునిగింది. రైతుల మోటార్లు, బోర్లు, పైపులైన్లు కొట్టుకుపోయాయి. దీంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటలను గుర్తించి ఆదుకోవాలని కోరుతున్నారు.



సుల్తానాబాద్: కదంబాపూర్‌లో నీరుచేరి దెబ్బతిన్న వరిపంట



జూలపల్లి:వడుకాపూర్ శివారులో నేలవాలిన వరి పొలం



చెరువులా మారిన మంథని మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలు

నేడు 2కే రన్

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఏక్తాదివస్ సందర్భంగా ముత్తారం పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం 2కేరన్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ రవి కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 6గంటలకు మండలంలోని కేశనపల్లి నుంచి హరిపురం వరకు 2కేరన్ ఉంటుందని, ప్రజలు యువకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా ఆదివరాహస్వామి కల్యాణోత్సవం

కమాన్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసిద్ధ ఆదివరాహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగాసాగింది. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోశ్చరణలతో సాగిన తంతులో స్వామివారలకు ప్రత్యేకపూజలు జరిగాయి.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

కమాన్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, ఉపాధి హామీసిబ్బందితో జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి నరేందర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, పారిశుద్ధ్యం, ఉపాధి హామీతోపాటు పలుఅంశాలపై సమీక్ష జరిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

మంథనిరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా కంకనాల శ్రీజా రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌కు చెందిన శ్రీజారెడ్డి ఇటీవల వెలువడిన గ్రూపు-1 ఫలితాల్లోఎంపీడీవోగా సెలెక్ట్ అయ్యారు. అమెకు మంథని ఎంపీడీవోగా అధికారులు పోస్టింగ్ ఇవ్వడంతో బాధ్యతలు స్వీకరించారు.

ఎన్ఎస్‌యూఐ డివిజన్ కోఆర్డినేటర్‌గా గంజి సాయి

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ మంథని డివిజన్ కోఆర్డినేటర్‌గా ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన గంజి సాయి నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి గంజి సాయిని మంథనిడివిజన్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సాయి

నేషనల్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రెండోవిడతలో కొనసాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపనులను మండలకేంద్రంలోని కాసర్లగడ్డ-కేశనపల్లి గ్రామాల మధ్య రైతులు గురువారం అడ్డుకున్నారు. హైవేనిర్మాణం కోసం తమ భూములు తీసుకొని పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదన్నారు. తమకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించేవరకు పనులు జరగనివ్వమని తెగేసి చెప్పారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ రవికుమార్ అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. రైతులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని వారు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరిన నీరు

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలోకి గురువారం వర్షంనీరు చేరింది. దీంతోకేంద్రానికి వచ్చిన విద్యార్థులను ఇళ్లకు పంపించారు. అంగన్‌వాడీ సత్యవతి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న సూపర్ వైజర్ స్వప్న, స్థానిక కార్యదర్శితో మాట్లాడి నీటిని తొలగించేలా చర్యలు చేపట్టారు.

మానేరు వరద నీటిని పరిశీలించిన ఎంపీడీవో

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల నేపథ్యంలో మానేరులో వరద ఉధృతిని ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామం వద్ద గురువారం ఎంపీడీవోసురేష్ పరిశీలించారు. ఎవరూకూడా మానేరు వాగు దాటి వెళ్లవద్దని, పరివాహకంగా ఉన్న వారు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులను మేతకోసం మానేరు ప్రాంతంలోకి తీసుకెళ్లవద్దని, అటుగావెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

పాలకుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు నేలవాలిన వరిపొలాలను గురువారం మండలవ్యవసాయాధికారి బండి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఏఈవోలు శశిధర్, యోజన పంటపొలాలను పరిశీలించారు. రామరావుపల్లెలో ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ..సుమారుగా 100 ఎకరాలలో వరిపంట నేల వాలిందన్నారు. కంకులు, గింజలు ఎక్కడ కూడా నేలరాలలేదు. కానీపంటలు అక్కడక్కడ నేలవాలాయన్నారు.

మేథాశక్తిని వెలికి తీసేందుకు టీఎల్ఎం మేళా

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న మేథాశక్తిని వెలికితీసేందుకు టీఎల్ఎంమేళా ఎంతో దోహదపడుతుందని నారాయణ పాఠశాలఏజీఎం చైతన్యరావు అన్నారు. గురువాం గోదావరిఖని మార్కండేయకాలనీలోని నారాయణపాఠశాలలో టీఎల్ఎం మెగా మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చైతన్యరావు విద్యార్థులు తయారు చేసిన వివిధరకాల ప్రాజెక్టువర్క్‌లను తిలకించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్వేత, ప్రిన్సిపల్‌రజని, వైస్‌ప్రిన్సిపల్ స్వర్ణలత, పోషకులు పాల్గొన్నారు.

హమాలీ యూనియన్ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లాకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన హమాలీవర్కర్స్ జిల్లా4వ మహాసభలో నూతనకమిటీని ఎన్నుకున్నారు. జిల్లాఅధ్యక్షుడుగా ఎర్రవెల్లి ముత్యంరావు, ప్రధానకార్యదర్శిగా గాదం గంగయ్య, ఉపాధ్యక్షులుగా బొమ్మనవేణి అంజయ్య, సంకరిఅంజయ్య, కొండ నంబయ్య, క్యాదాశి నర్సయ్య, రాజలింగం, జిల్లా కార్యదర్శులుగా సీపెల్లి రవిందర్, సత్తయ్య, గట్టయ్య, సుధాకర్, స్వామి, బుర్ర రమేష్, రాజయ్యతో పాటు 73మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ముత్యంరావు మాట్లాడుతూ నవంబర్ 15,16 రోజుల్లో పెద్దపల్లిలో మొదటిసారి జరుగుతున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.



ముత్యంరావు గంగయ్య

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలి

ఎలిగేడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులతో త్వరగా పూర్తిచేయించాలని జిల్లా గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్ అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి భాస్కర్‌రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇందిరమ్మ ఇళ్లపై గ్రామపంచాయతీల వారిగా పంచాయతీ కార్యదర్శుల సమీక్షించారు. పనులు మొదలు కాని వాటిని మార్క్ చేయించాలన్నారు. ఎం ఆవాస్ యాప్‌లో సర్వే వివరాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పరమా చారి, ఎంపీవో కిరణ్, ఏఈ నవ్య, ఏపీఎం గీతా, ఏపీవో సదానందం, సీసీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

అంతర్గాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరుమూర్ గ్రామంలో ఇటీవల మరణించిన ఎండీ సర్వర్ కుటుంబాన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు, అమ్మ భగవాన్ సేవాసమితి సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆ కుటుంబాన్ని పరామర్శించి 25కిలోల బియ్యాన్ని అందించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా ఉండాలి

● కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిని ఎంచుకునే వారు విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సిమ్స్‌కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వైట్‌కోట్‌సెర్మనీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాలలో మెరుగైన వసతులు, సౌకర్యాలు ఉన్నాయని, వైద్య కళాశాలలో నిబద్ధతతో పనిచేసే బోధకులు ఉన్నారని, ఇక్కడ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మంచిబోధన సౌకర్యం ఉందన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని గొప్పవైద్యులుగా మారాలని సూచించారు. రాబోయే ఐదుసంవత్సరాలు జీవితంలో చాలా కీలకంగా కాబోతుందని అనేకసార్లు నిరుత్సాహపడే పరిస్థితి రావచ్చని, ఒత్తిడి పెరగవచ్చని ఎట్టి పరిస్థితుల్లో నమ్మకం, ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరేందర్, ఆర్ఎంవో దండే రాజు, లావణ్య, ప్రదీప్‌చంద్ర, భానులక్ష్మి, ఫరీద్, అనూష, శిరిష, రవివర్మ, హర్షిణి, ఓబలేష్, కల్పన, అజయ్ పాల్గొన్నారు.

రామగుండంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయండి..

కోల్‌సిటీ: రామగుండం నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. గురువారం రామగుండం నగరపాలకసంస్థ కార్యాలయంలో అభివృద్ధిపనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో టీయూఎఫ్ఐడీసీ కింద చేపట్టిన పలు అభివృద్ధిపనులు, ఇతర పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. సమా వేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ, ఆర్అండ్‌బీ ఈఈ బావుసింగ్, కార్పొరేషన్ ఈఈ రామన్‌తో పాటు అధికారులు పాల్గొ న్నారు.

రామగుండం నగరాభివృద్ధికి రూ.50కోట్ల మంజూరు..

రామగుండం నగరాభివృద్ధికి ప్రభుత్వం మరో రూ.50కోట్ల నిధులను మంజూరు చేసిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో రెండు అభివృద్ధి పనులను చేపట్టేందుకు యూఐడీఎఫ్ స్కీమ్ క్రింద ప్రభుత్వం రూ.50కోట్ల నిధులను విడుదల చేసిందని, ఈ స్కీమ్ కింద నేషనల్ హౌసింగ్ బ్యాంక్ రూ.40కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు విడదల చేసిందని, ఈ పనులను 2026మార్చి నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్టు కలెక్టర్ తెలిపారు.



సిమ్స్‌లో వైట్‌కోట్ సెర్మనీని ప్రారంభిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో గురువారం షీటీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ మెంబర్ స్నేహలత మహిళల భద్రత, ఆన్‌లైన్‌మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.



సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేసిన యాజమాన్యం

● ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

గోదావరిఖని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్‌స్టాఫ్, ట్రేడ్స్‌మెన్‌లకు ఏఐటీయూసీ కృషివల్ల సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం గురువారం ఆదేశాలు జారీచేసిందని ఆయూనియన్ ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 2018నుంచి జూలై2025వరకు జరిగిన కార్పొరేట్ మెడికల్‌బోర్డులో అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన మైనింగ్‌స్టాఫ్, ట్రేడ్స్‌మెన్స్‌లకు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు యాజమాన్యం గురువారం ఆదేశాలు జారీచేసిందని ఆయన పేర్కొన్నారు, ఇది ఏఐటీయూసీ ఘనత అని పేర్కొన్నారు.

వృత్తివిద్యా కోర్సుల శిక్షకులకు ఇంటర్వ్యూ

రామగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిసంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో జీఎం సుధాకర్‌రావు ఆదేశాల మేరకు గురువారం వృత్తివిద్యా కోర్సుల శిక్షకులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. స్థానిక సేవాభవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్ఓటూజీఎం రామ్మోహన్, కమిటీసభ్యులు మహిళలను ఇంటర్వ్యూ చేపట్టారు. కార్యక్రమంలో అధికారులు మురళీకృష్ణ, సురేఖ, సుదర్శనం, రాజేశం, సురేఖ పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

మెడికల్ క్యాంప్‌ని సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం నవంబరు 2న నిర్వహించనున్న మెడికల్ క్యాంప్‌ను సద్విని యోగం చేసుకోవాలని ఆర్జీ-2 అధికార ప్రతినిధి అరవిందరావు ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో ఓమెగా హాస్పిటల్‌కు చెందిన స్పెషలిస్టువైద్యులు ఉద్యోగులకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, కార్డియాలజీ, యూరాలజీ విభాగాలకుచెందిన స్పెషలిస్టువైద్యులు ఆదివారం ఉదయం 10నుంచి సాయంత్రం 4వరకు వైద్యశిబిరంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులతోపాటువారి కుటుంబసభ్యులు, సీపీఆర్ఎంఎస్ కార్డుఉన్న రిటైర్డ్‌ఉద్యోగులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం అరవిందరావు పేర్కొన్నారు.

ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారికి.. జీఎంగా పదోన్నతి

రామగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిసంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారి సీహెచ్ వెంకటరమణ సింగరేణి కొత్తగూడెం ఆర్అండ్‌డీ డిపార్ట్‌మెంట్‌కు జీఎంగా పదోన్నతివరించింది. గురువారం వెంకట రమణను ఎంవీటీసీ మేనేజర్ సుజిత్‌కుమార్, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ అనంతుల శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నాగెల్లిసాంబయ్య, మార్త వీరన్న సత్కరించారు.

ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రామగుండం నగర అధ్యక్షుడు అబ్దుల్‌కరీం, ప్రధానకార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల కోసం పోరాటం చేసే యూనియన్ ఏఐటీయూసీ అని అన్నారు. శుక్రవారం నిర్వహించే ఆవిర్భావ దినోత్సవాలను రామగుండం నియోజకవర్గం లోని సంఘటిత, అసంఘటితరంగాల వారు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.